క్లుప్తంగా

ధర్మగ్రహ దీక్ష పోస్టర్ ఆవిష్కరణ



కోస్గి రూరల్: తపస్ ఆధ్వర్యంలో చేపట్టే ధర్మగ్రహ దీక్ష పోస్టర్ ఆవిష్కరణను మంగళవారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టారు. వారు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ నెల17న హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. వెంకటేష్, అనంతయ్య, రవీందర్‌రెడ్డి, సీఆర్‌పీ దస్తయ్య పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం తపస్ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ధర్మగ్రహ దీక్ష పోస్టర్‌ను విడుదల చేశారు. మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు గోపాల్, రాము, మురళి, పారిజాత, జయశ్రీ, రమాదేవి, అనిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మరికల్: పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్‌లో మంగళవారం తలపెట్టిన ధర్నాకు మండలం నుంచి దివ్యాంగులు తరలివెళ్లారు. ఈ మేరకు.. ఆ సంఘం నాయకులు మల్లప్ప, ఆశప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల పెన్షన్ పెంచాలని, అలాగే తమ సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. జ్ఞానిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు, యూసుఫ్ పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మవ్వ బోనాలు



మాగనూర్: మండలంలోని మారెమ్మవ్వ బోనాల ఉత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు.. గ్రామస్తులు అమ్మవారి దర్శనం అనంతరం బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి బయలుదేరారు. అమ్మవారికి పొట్టేళ్లు, కోళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్‌ఐ పి. అశోక్‌బాబు ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



మరికల్: మండలంలో నూతనంగా నిర్మిస్తున్న గజ్జలమ్మ ఆలయానికి సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ. లక్షా విరాళంగా అందజేశారు. అలాగే కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరన్న రూ. 51వేలు అందజేశారు. మరింత దాతలు సహకరిస్తే ఆలయ పనులు త్వరగా పూర్తిచేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, శ్రీను, కొండప్ప, రామకృష్ణ, నర్సింహులు, కుర్మన్న, రవి, చంద్రశేఖర్, సత్యన్న, రాఘవేందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పులిమామిడి పాఠశాలలో మాక్ పోలింగ్



ఊట్కూరు: మండలంలోని పులిమామిడి ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మాక్‌పోలింగ్ ఆకట్టుకుంది. పాఠశాల అధ్యక్ష పదవీ కోసం 5మంది అభ్యర్థులు పోటీ చేశారు. రవళి, మహేశ్వరి, సోమయ్య, వివేక్, రఘు పోటీ చేసి తమకు ఓటు వేయాల్సిందిగా తరగతులుగా విద్యార్థులను కలిసి ప్రచారం చేశారు. ఈ ఎన్నికల్లో 302మంది విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఓట్లు లెక్కింపు చేసి విజేతలను ప్రకటించారు. హెచ్‌ఎం బి. అనురాధ, నాయకులు చిన్న సూరయ్యగౌడ్, రాఘవరెడ్డి, శ్రీనివాసులు, వెంకటరామారెడ్డి పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడిని జయించొచ్చు

నారాయణపేట ఎడ్యుకేషన్: పరీక్షల సమయంలో ఒత్తిడి పడకుండా ఉండాలంటే ప్రతిరోజు యోగా, ధ్యానాలు చేసి మన మనసును మన ఆధీనంలో పెట్టుకోవచ్చని కో–ఆర్డినేటర్ ఆంజనేయులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న యోగ, ధ్యాన శిక్షణ తరగతులు ముగిశాయి. ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు వెంకట్రాములు, హన్మంతు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



నర్వలో అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నర్వ: నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని పీహెచ్‌సీకి కేటాయించిన 108 అంబులెన్స్‌ను ఆయన రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చినహామీ మేరకు నియోజకవర్గానికి నాలుగు అంబులెన్స్‌లను తీసుకొచ్చామన్నారు. దీంతో పాటు జిల్లాలో 9 సబ్‌స్టేషన్‌లు మంజూరు చేస్తే అందులో 7 సబ్‌స్టేషన్‌లు మక్తల్ నియోజకవర్గానికి తీసుకొ చ్చామన్నారు. ఏడాది పాలనలో మండలానికి రూ.1.25 కోట్ల సీసీ రోడ్లు, రూ.1.39 కోట్ల ఎస్సీ సబ్‌ప్లాన్‌లో డ్రెయినేజీ నిర్మాణాలు, రూ.27 లక్షలు తాగునీటి అవసరాల కోసం, రూ.3 కోట్లతో జక్కన్నపల్లికి బీటీరోడ్డు ఏర్పాటు చేయించామన్నారు. అనంతరం యాంకి గ్రామంలో గ్రామస్తులు సహకారంతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను స్థానిక నాయకులు, గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శైలజ, 108 జిల్లా అధికారి రాఘవేందర్, చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, వివేకవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

కృష్ణా: గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. మండల కేంద్రంలో అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. కార్యక్రమంలో రాజప్పగౌడ, మహదేవ్, నాగప్ప, నాగేంద్ర, రాంలింగప్ప, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పండగ సాయన్న సేవలు మరవలేనివి

మరికల్: పండగ సాయన్న పేదలకు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పండగ సాయన్న పేదలకు చేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, బసంత్, నారాయణ, కొండప్ప, శేఖర్, కుర్మన్న, కృష్ణయ్య, రామకృష్ణ, సతీష్, రాజు, సత్యన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

మక్తల్: పండుగ సాయన్న వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మంగళవారం ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సాయన్న పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలి



స్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

నారాయణపేట రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని వాదిరాజ మఠం పీఠాధిపతులు శ్రీ విశ్వ వల్లభ తీర్థ స్వాములు అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామల ప్రజలు ఆయనకు స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ఆంజనేయ, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలుచేసి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఉరుకుల పరుగుల జీవితంలో శరీరానికి విశ్రాంతి, మనసుకు ప్రశాంతత లభించాలంటే ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన చేయాలన్నారు. పాఠశాల దశ నుంచి పిల్లలను సన్మార్గంలో నడపాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో భరత్ రాజ్, వెంకటేశ్వరరావు, త్రివిక్రమ్ రావు, జయతీర్థ, రామారావు, శేషు, ప్రవీణ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మక్తల్: మండలంలోని కర్ని ఉన్నత పాఠశాలలో 1996–2001బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు.. అప్పటి మధుర జ్ఞాపకాలను వారు నెమరువేసుకుని ఆస్వాదించారు. కృష్ణ, వీరేందర్, రమేష్, జైపాల్‌రెడ్డి, రామ లింగం యాదవ్, అంజప్ప, రామలింగం, ఆంజనేయులు, అంజప్ప, హైమావతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలి



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి నాగార్జునరెడ్డి

మద్దూరు: విద్యార్థుల్లో బోధన అభ్యసన సామర్థ్యాలను పెంచడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈఓ గోవిందరాజులు సూచించారు. మంగళవారం మండలంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో ఎఫ్‌ఎల్‌ఎన్, ఎఫ్‌ఆర్‌ఎస్, యూడైస్, ఐఎస్‌ఎంఎస్ వంటి వాటిపై సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక స్థాయి నుంచి పదోతరగతి వరకు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని మానిటరింగ్ చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనంపై హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలకిష్టప్ప, సెక్టోరియల్ అధికారులు శ్రీనివాస్, నాగార్జునరెడ్డి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వైద్య విజ్ఞాన సదస్సు విజయవంతం

నారాయణపేట రూరల్: స్థానిక శ్రీసాయిబాబా ఆలయంలో మంగళవారం నిర్వహించిన వైద్య విజ్ఞన సదస్సు విజయవంతమైంది. నరాల వైద్యులు డాక్టర్ జీవీఆర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చారు. నరాలకు సంబంధించిన వ్యాధులకు కారణాలు, నివారణ చర్యలను తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తీసుకోవాల్సిన ఆహారం, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నర్సింగ్, జమీర్‌పాషా, చింతలయ్య, సత్యకుమార్, నారాయణ, శ్రీనివాస్, సవితారాణి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

పండుగ సాయన్నకు ఘన నివాళి



కోటకొండలో చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండలో మంగళవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలో సాయన్న విగ్రహ ఏర్పాటుకు విరాళాలను సేకరించారు. ఆయా కార్యక్రమాల్లో సరాఫ్ నాగరాజు, మల్లేష్, హన్మంతు, వెంకటయ్య, గురు మేస్త్రి, కార్తీక్, భీమయ్య, శ్రీనివాసులు, నర్సింహులుపాల్గొన్నారు.

● ధన్వాడ మండలంలో బస్‌స్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదవరెడ్డి, రఘువీర్‌యాదవ్, రాంచంద్రయ్య, భాస్కర్, నరేందర్ పాల్గొన్నారు.

● మద్దూరు మండల కేంద్రంలోని అతిథిగృహం వద్ద ముదిరాజ్ నాయకుల ఆధ్వర్యంలో పండుగ సాయన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటయ్య, రాములు, నారాయణ, ఆశప్ప, విజయ్, నర్సింహ పాల్గొన్నారు.



దామరగిద్దలో..

● దామరగిద్దలో పండగ సాయన్న వర్ధంతి సందర్భంగా మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మొగులప్ప ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సీఎం రేవంత్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



నర్వ: సీఎం రేవంత్‌రెడ్డిని మండలానికి చెందిన రఘురాం శివంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తనను సీఎం అభినందించారన్నారు. ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ముందుండాలని సూచించారన్నారు. ఆయనతోపాటు యూత్ కాంగ్రెస్ నాయకులు జక్కిడి శివచరణ్‌రెడ్డి తదితరులున్నారన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ధన్వాడ: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వాటిని పట్టుకుని వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

కష్టపడి చదివితే విజయం సులువు



కోస్గిరూరల్: కష్టపడి చదివితే విజయం సులువుఅవుతుందని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి సుదర్శన్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ ఒకేషనల్ పారామెడికల్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం కళాశాలలో రికార్డులను పరిశీలించారు. ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ.. తాము ఎంచుకున్న లక్ష్యం సాధించేందుకు నిత్యం కష్టపడాలన్నారు. ఉన్నత శిఖరాలకు ఎదగాలని తమ తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్యాన్‌రాజ్, సౌజన్య, కిశోర్‌రెడ్డి, రాజు నాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇంటిట్యాక్స్ చెల్లించి సహకరించాలి

దామరగిద్ద: గ్రామ ప్రజలు విధిగా ఇంటి ట్యాక్స్‌లు చెల్లించి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, శివానంద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇంటి పన్ను చెల్లించాలని ఇంటింటికీ తిరిగి పన్ను కట్టాలని అడిగారు. గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు, కార్మికుల వేతనాల చెల్లింపునకు ఇంటి ట్యాక్స్‌ల ద్వారా సమకూరే నిధులను ట్రెజరీ ఖాతాల్లో జమచేస్తున్నట్లు తెలిపారు. ట్యాక్స్‌లు చెల్లించిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

కోస్గిరూరల్: మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో నెలకొన్న సమస్యలపై స్వయంగా కలెక్టర్ పర్యవేక్షించి తక్షణమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించిన అధికారులు మాత్రం ఆచరించడం లేదని మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జనార్ధన్, వెంకట్ నర్సింహులు, కోనేరు సాయప్ప, చెన్నకేశవులు, తదితరులు ఉన్నారు.

పట్టణ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో పలువురు అధికారులు

నారాయణ పేట టౌన్: ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న పట్టణ స్థాయి క్రీడా పోటీలను మంగళవారం గ్రౌండ్ స్కూల్ మైదానంలో మున్సిపల్ చైర్మన్ గందె అనసూయ, పుర కమిషనర్ సునీత ముఖ్య అతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ముందుగా ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి, జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం పుర కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణ స్థాయి క్రీడలకు యువత, విద్యార్థులు ఆశించిన మేర పేర్లను నమోదు చేసుకోలేదని అన్నారు. యువత మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా క్రీడలపై ఆసక్తిని పెంచుకుని శారీరకంగా, మానసికంగా బలంగా తయారు కావాలన్నారు. డీవైఎస్‌ఓ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు మెరుగైన ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో ప్రకటించిన నగదు పురస్కారాలను సాధించాలన్నారు. అనంతరం పుర కమిషనర్ సునీత క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి కబడ్డీ, వాలీబాల్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో పీడీలు అక్తర్, పర్వీన్‌బేగం, విద్యాసాగర్, విజయ్, భాను పాల్గొన్నారు.

క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయి



సీఎం కప్ పోటీలు ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్

నారాయణపేట రూరల్: క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి అన్నారు. సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం కోటకొండ జెడ్పీ స్కూల్ మైదానంలో ఆయన ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి క్రీడాకారుడు ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుదర్శన్, జయలక్ష్మి, శ్రీనివాస్, ఎంఈఓ బాలాజీ, కాంగ్రెస్ నాయకులు ప్రభంజన రావు, హెచ్‌ఎం సునీత, మార్కెట్ కమిటీ సభ్యులు శరణప్ప, వ్యాయామ ఉపాధ్యాయులు రమణ, నర్సింహులు, శ్రీధర్, మహేష్, డాక్టర్లు ప్రతిభ భారతి, అహ్మద్, నవ్య దీప్తి, శృతి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు సరికాదు



పేటలో చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నారాయణపేట రూరల్: తెలంగాణా తల్లి విగ్రహంలో కాంగ్రెస్ పార్టీ మార్పులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు విజయ్ సాగర్, వేపూరి రాములు అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ సత్యనారాయణ చౌరస్తాలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు.. తెలంగాణ అస్తిత్వమైన తెలంగాణ తల్లి విగ్రహంలో తలపైన కిరీటాన్ని, ఆభరణాలు, చేతిలో ఉన్న బతుకమ్మతోపాటు ఇతర మార్పులు చేయడం సరికాదని విమర్శించారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి, గురులింగప్ప, సుదర్శన్ రెడ్డి, కన్న జగదీష్, బోయ లక్ష్మణ్, హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.

● కొత్తపల్లిలో విగ్రహ మార్పునకు వ్యతిరేకంగా తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. రాంరెడ్డి, మన్యం యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● ధన్వాడ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో శ్రీనివాసగౌడ్, చంద్రశేఖర్, గౌని శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్, శివారెడ్డి, బాల్‌రాజు, విరేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

శివాజీ చౌరస్తాలో..

కోస్గి రూరల్: పట్టణంలోని శివాజీ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహ మార్పును నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. జనార్దన్, పోశప్ప, మోహన్, వెంకట్‌నర్సింహులు, బిచ్చప్ప, హన్మంతు, సాయిలు పాల్గొన్నారు.



ధన్వాడలో..



కొత్తపల్లిలో..

ప్రభుత్వ పాఠశాలలో బ్రెక్ ఫాస్ట్



విద్యార్థులకు భోజనం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కొత్తపల్లి: హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అల్పాహారంగా నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందజేశారు. ఈ మేరకు.. ఏంఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు ఈ ఫౌండేషన్ ద్వారా అల్పాహారం అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ కంఠం భూ కబ్జాను అడ్డుకోండి



ఎంపీడీఓసాయి ప్రకాష్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ధన్వాడ: మండల కేంద్రంలోని గ్రామ కంఠం భూములను కాంగ్రెస్, బీజేపీ నాయకులు కబ్జాలు చేస్తున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోదిగెల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీఓసాయి ప్రకాష్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. లక్షల విలువైన భూములను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతుంటే పంచాయతీ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే ఆక్రమదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్, అశోక్, గౌతం అజయ్‌కుమార్, శ్రీకాంత్, రాము, రాజు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

కోస్గి రూరల్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్‌కు పూనాది వేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయన్ని ముట్టడించారు. విద్యార్థుల సమస్యలపై తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈమేరకు.. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయక పోవడంతో ఎంతోమంది విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. సర్టిఫికెట్లకోసం విద్యాసంస్థల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.